పెద్దకథ

# పునర్జీవులు

రైలు విజయవాడ స్టేషనులో ఆగింది. విజయవాడ స్టేషనులో జన సమర్దాన్ని కేం చెప్పాలి? రైలు దిగేవాళ్లు దిగుతుంటే జనాన్ని నెట్టుకుని ఎక్కేవాళ్లు ఎక్కుతున్నారు. లలిత నెట్టే వస్తున్న జనాన్ని ఒత్తిగించుకుని రైలు దిగింది. లలిత ఎక్కిన పెట్టెలో నించి కొందరు ప్రయాణీకులు పెట్టె బేడా సామాను కిందకి దించుకుంటున్నారు. ఆ పెట్టె లో కూర్చున్న ఓ కుటుంబాన్ని చూస్తే లలితకి ఎంతో ముచ్చట వేసింది. దంపతులు చిన్న వయసు వాళ్ళు. ఆవిడకు పాతికేళ్ల వయస్సుంటుంది. ప్రేమగా నాజూకుగా వుంది. అతడు రైలు ఆగిన ప్రతి స్టేషనులోనూ భార్యకు అది కావాలా? ఇది కావాలా? అని అడిగి ఆవిడ కోరినవి తెచ్చి అందిస్తూనే వున్నాడు. వాళ్లకి ఇద్దరు పిల్లలు. పెద్ద పిల్లకు మూడేళ్లు వుంటాయి. కుర్రవాడికి ఏడాది వుంటుంది. ఆపిల్లల మాటలు ముత్యాల మూటలు. వాళ్లను చూస్తే లలితకు ఎంతో ముచ్చట వేసింది. ఆవిడ "ఎక్కడికి వెళ్తున్నావమ్మాయీ" అని లలితను పలకరించింది. లలిత విజయవాడ వెళ్తున్నానని బదులు చెప్పింది. లలిత జ్ఞానాన్ని తప్పించుకుని నవ్వుతున్నట్లున్న మాటే గాని ఆమె కళ్లల్లో దైన్యం ఎక్కువ ఆకుటుంబమే మెదులుతున్నది. ఆ పిల్లల మాటలు తలపుకు వస్తున్నవి. దంపతులు అట్లా అన్యోన్యంగా వుండేది ఎంతటి అదృష్ట వంతులకో! తనకా యోగ్యత లేదు. తానెంత పాపం చేసుకుందో?

తన వివాహమయి రెండేళ్లయింది. అత్తగారిది విజయవాడ దగ్గరలో వున్న గ్రామం. ఏ ఆరు మాసాలో అత్తవారింట్లో కాపురం చేసింది. అత్త ఓ రకం. భర్త చదువుకున్నవాడే గాని ఏం లాభం చెడు సహవాసాలకు లోనై తనను సరిగా చూసేవాడు కాదు. తనను సరిగా చూడక పోగా ఆఖరుకు తిండికి గూడా కష్టం వాళ్లు ఎక్కువ పెట్టింది. ఆ బాధలు పడలేక తాను పుట్టింటి దగ్గరనే వుంటున్నది.

గేటువద్ద టిక్కెట్టు కలెక్టరుకు లలిత తన టిక్కెట్టు చూపి బయటికి వచ్చింది. గుర్రపు బళ్ల మీదా రిక్షాల మీదా కొందరు, కొందరు కాలినడకనా రైలు దిగిన జనం వెళ్లి పోతున్నారు. ఇందాక రైల్లో కనిపించిన కుటుంబం ఓ జట్కా ఎక్కి వెళ్లిపోతున్నారు. లలిత వాళ్ల వేపే చూస్తూ నడవ సాగింది. ఆ బండి కనుచూపుమేర దాటి పోయింది.

లలిత ఆ రోడ్డు దాటి ఓ వీధిలో ప్రవేశించింది. ఆ వీధిలో షాపులు ఆట్టే లేవు. ఒకటి రెండు సోడా షాపులు ఒకటి రెండు కిళ్లీల దుకాణాలు ఆమ్మే చిన్న దుకాణాలు వున్నవి. ఎవరెవరో వీధినే పోతున్నారు. లలిత ఆ వీధినే నడవ సాగింది. ఓ యువకుడు పాతికేళ్లుంటవి సాధారణమైన బట్టలు వేసుకున్నాడు. అందులో అవి కొంత మాసిపోయి వున్నవి. ఆ యువకుడు లలితను సమీపించాడు. లలితకు అతన్ని చూసే సరికి భయం వేసింది. అతడు నిన్నటి రోజున ఇంటి వేళకు ఆ వీధిలోనే లలితను వెంబడించి ఆ ప్రశ్నా ఈ ప్రశ్నా వేసి లలితను విసిగించాడు.

## అందే నారాయణస్వామి

వాళ్లా ఇప్పుడూ తయారయ్యాడు. ఏమిటి వీడు? తనతో వీడికేం పని? లలితకు పట్టరాని కోపం వచ్చింది. అతడు లలితను వెంబడిస్తూ ఎక్కిరి తిక్కిరి ప్రశ్నలు వేయడం మొదలు పెట్టాడు. అసలే బస్తీల్లో రౌడీలు వుంటారు. జాగ్రత్తగా వాళ్లమ్మ చెప్పనే చెప్పింది! లలిత వాడి మీద కోపంతో వాణ్ణి తప్పించుకుని చరచరా నడచివెళ్లి తన గమ్య స్థానం చేరుకుంది.

ఆ మర్నాడు లలిత వాడుక ప్రకారం ఇంటి దగ్గర నుంచి పుస్తకాలు టిఫిన్ క్యారియర్ పుచ్చుకుని రైలు స్టేషనుకు వెళ్లబోతుంటే వాళ్ల అన్నయ్య వెంకటేశ్వర్లు గూడా తనకు వేరే పని వుండడంవల్ల లలితతో కూడా విజయవాడ బయలుదేరాడు. లలితకు తల్లి అన్న మాత్రం వున్నారు. తండ్రి లేడు. వాళ్లది పెద్ద సంసారం ఏమీ కాదు! వెంకటేశ్వర్లు ఎక్కడో గుమస్తాగిరి చేస్తున్నాడు. లలితకు అత్తగారింట ఆశ లేక పోవడంవల్ల విజయవాడ వెళ్లి ఒక కంపెనీలో కుట్టుపని నేర్చుకుంటున్నది. అన్నా, చెల్లెలూ స్టేషన్ చేరుకునే సరికి రైలు వచ్చి సిద్ధంగా వున్నది. ఇద్దరూ రైలెక్కి విజయవాడ చేరుకొని రైలు స్టేషన్ దాటి నడిచి వెళ్తున్నారు. కొంత దూరం వెళ్లాక ఓ వీధిమలుపు దగ్గర "ఇక వెళ్లు మరి అమ్మాయీ" అన్నాడు వెంకటేశ్వర్లు.

లలిత తలవంచి "ఇటువైపు వెళ్లాలంటే భయంగా వున్నది అన్నయ్యా" అన్నది వణుకుతూ.

"ఎందుకమ్మా?" అని అడిగాడతను.

లలిత నెత్తురుడుకుతున్న అన్నయ్యతో ధైర్యం చెప్పుకోవటానికి సిద్ధపడి "ఈ బజార్లో రెండురోజుల నించి ఎవడో నన్ను వెంటాడుతున్నాడన్నయ్యా!" అంది బిడియపడుతూ మెల్లగా.

"అట్లాగా! పద వాడెవడో వాడి అంతు కనుక్కుందాం" అన్నాడు కరుగ్గా వెంకటేశ్వర్లు.

ఇద్దరూ నడుస్తున్నారు. ఆ బజారు మలుపు తిరిగాక వెంకటేశ్వర్లు "నేను వెనకవస్తాను. నువ్వు ముందు నడు అమ్మాయీ. నన్ను చూసి వాడు వెనక్కు తగ్గుతాడేమో? ఇవాళ్టి వాడి అంతు కనుక్కోవాలి" అన్నాడు. అన్న చెప్పిన ప్రకారం లలిత ముందు నడవ సాగింది. లలిత కొంత దూరం నడిచాక నిన్నటి వాడు రానే వచ్చాడు! వాడు లలిత వెంటపడుతూ అదీ ఇదీ వాగడం మొదలు పెట్టాడు. అది చూస్తే వెనకవస్తున్న వెంకటేశ్వర్లు కోపంతో ఒక్క అంగలో వాణ్ణి సమీపించి "ఎవడివిరా నువ్వు? ఏరా! అమ్మాయితో నీకేంపని??" అంటూ వాడి జుట్టు పట్టుకుని చెంపలు వాయించ సాగాడు. అప్పుడు వాడు లబో దిబోమంటూ "నన్ను కొట్టకండి సారూ! నా తప్పేమీ లేదు. నన్ను పంపినవాడు మరి ఒకాయన వున్నాడు" అంటూ అక్కడకు దాపులో వున్న సోడాకొట్టు వద్దకు తీసుకు వెళ్లి! అక్కడ కుర్చీమీద కూర్చున్న ఓ యువకుణ్ణి చూపించాడు. ఆ యువకుణ్ణి చూసే సరికి వెంకటేశ్వర్లు చకితుడయ్యాడు. అతను ఎవరో కాదు లలిత భర్త శేషగిరి. అతణ్ణి చూసే వెంకటేశ్వర్లుకు మంట. "నువ్వేనా అతన్ని పంపింది?" అన్నాడు కోపంతో.

కుర్చీలో కూర్చున్న శేషగిరి సిగరెట్టు పొగ వదులుతూ కొంటెగా నవ్వుతూ "అవును నేనే పంపాను. ఎక్కడికి వెళ్తుందో తెలుసుకోటానికి పంపాను. పుట్టింట వుండి అక్కచెల్లెళ్లను ఇట్లా తిప్పుతున్నావా?" అని ఎగతాళిగా అన్నాడు.

ఆ మాటతో వెంకటేశ్వర్లుకు ఉద్రేకం మరింత హెచ్చింది. "భార్యను పోషించు చాతగాని వాడికి ఇవన్నీ దేనికి?" అన్నాడు.

"నా కొక ఇల్లంటూ వుంటే నీ గాజులు తొడిగించుకున్నావా? చెల్లెలికి ఇంత అన్నం పెట్టలేక ఇట్లా తిప్పుతున్నావు".

"ఆ మాట అనటానికి సిగ్గు లేదూ? భార్యను పోషించలేక నువ్వు గాజులు తొడిగించుకుని కూర్చోరాదూ?"

"... అంటున్నా ఎందుకైతే అన్నా ఏమిటు చేస్తావు."

"దాన్ని నానా హింసలూ పెడుతూవుంటే నీ దగ్గర ఎలా నిభాయిస్తుంది?"

"నీకుమల్లేకాదు చెల్లెలికి దుర్బోధ చేసి యింట పెట్టుకుని ఆడదానివల్ల బ్రతకాలని చూస్తున్న నీదీ ఒక బ్రతుకేనే?"

యిద్దరికీ మాటలు ముదిరి చేతులు కలవబోగా అక్కడ చేరిన నలుగురూ యిద్దర్నీ విడదీశారు. లలిత ముందుగా భర్తను చూడగానే అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయింది.

2

తర్వాత వారం పది రోజులకు ఒకనాటి పుదయం లలిత స్వగ్రామమైన దుగ్గిరాల స్టేషను లో రైలెక్కింది. రైలు కదలబోతున్న వేళకు ఒక అమ్మాయి 20 ఏళ్ళుంటవి. ఆదరాబాదరాగా వచ్చి లలిత ఎక్కిన పెట్టెలో ఎక్కింది లలిత అవతలకు జరిగి ఆ అమ్మాయికి చోటిచ్చింది. యింతలో రైలు కదిలింది అమ్మాయి సావధానంగా కూర్చున్నాక "దుగ్గిరాలేనా అమ్మాయి మీది?" అని అడిగింది లలిత.

"అవును దుగ్గిరాలే" బదులు చెప్పింది ఆ అమ్మాయి.

"ఎప్పుడూ నిన్ను చూడలేదులే అందుకని అడుగుతున్నాను". అంది లలిత.

"మాది అవతల తూర్పువీధి" అంది ఆ అమ్మాయి.

"ఎక్కడికి వెళ్ళుతున్నావు?" అని అడిగింది లలిత.

"విజయవాడ"

"చుట్టాలింటికా?"

"కాదు టైపు నేర్చుకో బోతున్నా"

"రోజూ వెళ్ళుతున్నావా?"

"ఆఁ"

"అయితే రైల్లో నాకెప్పుడూ కనిపించలేదే?"

"నాలుగు రోజులబట్టి వెళుతున్నాను. నువ్వు రోజూ రైల్లో వెడుతూవుంటావా?"

"ఆఁ నేనూ రోజూ విజయవాడ వెళుతూ వుంటాను".

"అట్లాగా! ఏం పనిమీద?"

"కుట్టుపని నేర్చుకుంటున్నాను. నీపేరేమిటి?"

"సరళ"

"నువ్వు టైపు నేర్చుకునేదెక్కడ?"

"హనుమాన్‌పేట రోడ్డు మలుపులో పెద్ద మేడవుంది చూడు కింది అంతస్తులో తెలుగు టైపు నేర్పబడును' అని బోర్డు వుంటుంది. అక్కడ నేను నేర్చుకునేది".

"నువ్వు నేర్చుకునేది తెలుగు టైపు అన్నమాట."


"ఉఁ"

"నేనింకా పైకి వెళ్ళాలి. అయితే మనిద్దరం రోజూ తోడుగా వెళ్ళవచ్చు".

రైలు విజయవాడ చేరింది యిద్దరూ దిగి వెళ్ళారు.

లలితా, సరళా అప్పటినుంచి ప్రతిరోజూ పుదయానే రైలు స్టేషను దగ్గర కలుసుకుని యిద్దరూ కలిసి విజయవాడ వెళ్లేవారు. వెళ్ళేటప్పుడేకాదు తిరిగి యింటికి వచ్చేటప్పుడు కూడా ప్రతిరోజూ సాయంత్రం విజయవాడ రైలు స్టేషనులో కలుసుకుని యిద్దరూ ఒకే బండికి యిల్లు చేరుకునేవారు. యిట్లా యిద్దరికీ స్నేహం ఏర్పడ్డది.

ఒకరోజు సాయంత్రం లలితా, సరళా విజయవాడ స్టేషనులో కలుసుకుని యిల్లు చేరుకోడానికి బండికోసం నిరీక్షిస్తున్నారు. ప్లాటు



ఏటినుంచి నీటికడవలు... ఫోటో: ఎ. వి. యస్. యస్. శాస్త్రి.

ఫారమంతా ప్రయాణీకులతో అలజడిగా వున్నది. కూర్చున్న వాళ్ళు కూర్చోగా పెట్టే బేడా కూలివాళ్ళచేత మోయించుకుని వచ్చే ప్రయాణీకులు యింకా వస్తున్నారు. లలితా, సరళా హిగ్గిన్‌బాథంస్ పుస్తకాల షాపు దగ్గర కూర్చున్నారు. లలిత, సరళా రూపంలో ఒకళ్ళకు ఒకళ్ళు ఎవరూ తీసిపోరు! యిద్దరూ అందంగానే వుంటారు. చెంపకు చారెడేసి కళ్ళు, సన్నటి పెదాలు, గుండ్రటి ముఖం, ఎర్రటి శరీర ఛాయ, అయితే శరీర ఛాయలో మాత్రం సరళకంటే లలిత ఒక వన్నె తక్కువని చెప్పాలి. యిద్దర్నీ చూసినవాళ్ళు అక్కచెల్లెళ్ళను కోవాలిఅప్పుడే స్టేషను లోకి వస్తున్న శేషాచలం దూరాన్నించే లలిత సరళనూ చూశాడుగాని లలిత అతన్ని చూడలేదు. శేషాచలం బండికోసం వచ్చాడో? లేక స్టేషనులో ఏదైనా పనివుండి వచ్చాడో? మరి అవతలగా బల్ల మీద కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు. యింతలో గుప్పుగుప్పున పొగలు చిమ్ముకుంటూ రైలు వచ్చింది. జనమంతా హడావుడిగా ఎక్కటం మొదలుపెట్టారు. లలితా, సరళా ఆడవాళ్ల పెట్టెలో ఎక్కేరు. కాసేపటికి కూతకూసి బండి కదిలింది.

ఆమర్నాడు సాయంత్రం యిల్లు చేరుకోడానికి లలితా, సరళా విజయవాడ స్టేషన్ చేరుకునేసరికి బండి అరగంట లేటని తెలిసింది. యిద్దరూ స్టేషనులో రొట్టె, పండ్లు అమ్మే షాపుదగ్గరగా బల్ల మీద కూర్చున్నారు. అట్లా చాలామంది ప్రయాణీకులు ప్లాటుఫారంనిండా కూర్చుని బండికోసం నిరీక్షిస్తున్నారు. సరళ ఒక అణా అరటిపండ్లు కొనుక్కొచ్చి రెండు లలితకిచ్చి రెండు తాను తిన్నది. ఎంతసేపటికి బండి రాదు. రోజూ ఆరింటికి వచ్చే బండి దాదాపు యేడుగంటలైనా యింకా రాలేదు.

పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్న లలితకు హఠాత్తుగా తన ఎదుట నిలబడిన వ్యక్తిని చూసేసరికి హడలిపోయింది. పులినిచూసిన లేడిపిల్లలా వణికిపోయింది. అతడు తనభర్త శేషాచలం. అతడు తనదగ్గిరికి ఎందుకు వచ్చినట్టు. అసలే విరోధంపూనివున్నాడు. ఏమంటాడో ఏంచేస్తాడో అని లలిత గుండెలు వేగంగా కొట్టుకోనారంభించినవి.

"ఏం లలితా ఖులాసాగా వున్నావా? కుట్టుపని నేర్చుకోడం యింకా పూర్తికాలేదా!" ఈ చల్లని మాటలు శేషాచలం నోటినుండి వెలువడినవి.

అతడింత ఆప్యాయంగా మాట్లాడి నందుకు లలిత హృదయంలో భీభత్సంగా అలుముకుంటున్న కారుమేఘాలు చెల్లాచెదరై పోయినవి. ఆమె గుండెలు తేలికపడ్డవి. అతడు తనతో ఎప్పుడూ యింత ఆప్యాయంగా యింత లాలనగా మాట్లాడి ఎరగడు. ఆమెకు సంతోషంతోపాటు ఆశ్చర్యం గూడా కలిగింది. అప్పుడు అతనికేసి ధైర్యంగా చూడగలిగింది. యిటీవల సోడాషాపుదగ్గర చూసినప్పటికి యిప్పటికీ ఏమాత్రం పోలికా లేదు. అప్పుడు మాసిన బట్టలు వేసుకున్నాడు, జుట్టు రేగివున్నది. మనిషి అదోవిధంగా వున్నాడు. యిప్పుడు ధనవంతులు వేసుకునే సిల్కుసూటు వేసుకుని వున్నాడు. అందంగా క్రాపు దువ్వుకున్నాడు. చిరునవ్వుతో మాట్లాడుతున్నాడు. చేతులో లెదరుబాగు వున్నది.

అతడు అడిగిన ప్రశ్నకు లలిత "యింకా పూర్తి కాలేదు' అంది తలవంచుకుని మెల్లగా.

"అట్లాగా ఈ అమ్మాయి యెవరు?" అని అడిగాడు.

"మావూరే. యిక్కడ టైపు నేర్చుకుంటు న్నది" అంది లలిత.

అతడు "అట్లాగా" అంటూ బాగులోనుంచి చెక్కరకేళీలుతీసి చెరి నాలుగుపండ్లు యిచ్చాడు. అనుకోని ఈ ఆదరణకు లలిత లోలోన పొంగిపోయింది.

యింతలో సొనకంలో పుడకలా గొంతు చించుకుంటూ రైలు వచ్చేసింది. లలితా, సరళా హడావుడిగా వెళ్లి రైలెక్కారు.

3

తర్వాత నాలుగురోజులకు ఆవాళ లలిత రాలేదు సరళ వక్కతే యింటికి వెళ్లడానికి బండివేళకు విజయవాడ రైలుస్టేషను చేరుకుని హిగ్గింబాదమ్స్ పుస్తకాల షాపుదగ్గరగా బల్లమీద కూర్చుంది. ఆ బల్లమీద అదివరకే యెవరో స్త్రీ కూర్చునివుంది. బండి యింకా రాలేదు. ప్లాటుఫారంనిండా జనం కిక్కిరిసి వున్నారు. సరళ కూర్చున్న బల్ల సమీపంలో ఓ యువతి నలుగురు పిల్లలూ బెడ్డింగూ, ట్రంకుపెట్టె మొదలైన సామానుతో కూర్చుంది. ఆ యువతి విలువైన సిల్కుచీరె ధరించింది. మెళ్లోనూ, చేతుల ముందూ చాలా ఆభరణాలు వున్నవి. నౌకరు పిల్లలకూ ఆమెకూ ఏవేవో తినుబండారాలు తెచ్చి అందిస్తున్నాడు. యింకా అవతలగా ఎవరెవరో సామానులు పెట్టుకుని కూర్చున్నారు. సరళ ఆ సిల్కుచీర కట్టిన ఆవిడవేపు ఆమె ఆభరణాలవేపు దీక్షగా చూస్తున్నది.

"లలిత రాలేదేం అమ్మాయ్?' నువ్వు ఒక్కదానివే వచ్చావు."

సరళ తలతిప్పి అటు చూసింది. శేషాచలం చేతిలో బాగుతో దగ్గరగా నిలబడి వున్నాడు. 'లలిత యివ్వాళ రాలేదు" అంది.

"యెందుకని?" అని ప్రశ్నించాడతడు.

"వీలుకాలేదు."

"నువ్వు టైపు నేర్చుకునేది యెక్కడ?"

ఆమె చెప్పింది.

"లలిత నీ స్నేహితురాలా?"

"వూ"

"వాళ్ల యింటిదగ్గరేనా మీ యిల్లు?"

"కాదు తూర్పువీధిలో."

"మీనాయన యేం చేస్తూ వుంటాడు?"

"ఏమీ చెయ్యడు. సరళ అతని మాటలకు జవాబు చెప్పటానికి యిష్టం లేదులాగుంది. అతకేసి చూడకుండా ఎదురుగా రైలుపట్టాల మీద నిల్చిన గూడ్సు పెట్టెలవంక చూస్తూ జవాబు చెపుతున్నది.

అతడు మళ్లా "మీకు భూవసతి ఏమైనా వుందా?" అని అడిగాడు.

"లేదు"

"ఎట్లామరి మీ కుటుంబ పోషణ?"

"భోజన హోటలు".

"అట్లా చెప్పవేం మరి".

యింతలో ఒక అవ్వ అరవైయేళ్ళ పైన వుంటవి. ఒక కుర్రవాడిని వెంటపెట్టుకుని అక్కడకు వచ్చి యిదిగో సరళమ్మా మనవూరు వాళ్ళు ఎవరైనా కనపడతారేమోనని యిందాకటి బట్టి చూస్తున్నాను. మాపెద్దపిల్ల నీళ్ళాడితే గన్నవరం వెళ్ళి వస్తున్నా. రైల్లో ఈ పోడు పిల్లాడు ఏడిపించి కొనుక్కు తిన్నాడమ్మాయ్. టిక్కట్టు కొందామంటే డబ్బులు తరుగుపడ్డయ్. పావలా తక్కువయింది. అదీ వాడొక్కడానికయితే సరిపొయ్యేది. వచ్చేటప్పుడు ఈ కుర్రాడికి అరటిక్కట్టు తీసుకోలేదని రైలు నచ్చినాళ్ళు పట్టుకున్నారమ్మాయ్. యిప్పుడు వీడికిగూడా అరటిక్కటు తీసుకోవాలి. నీదగ్గర ఒకపావలా వుంటే యివ్వమ్మా. యింటికి వెళ్ల గానే యిస్తాను" అని అడిగింది.

సరళ తన దగ్గరవున్న డబ్బులు చూసుకుని "బేడమాత్రం వుంది" అవ్వా అని చెప్పింది.

"అయ్యో యెట్లాగమ్మాయ్? మనవూరి వాళ్ళు యెవరూ కనిపించలేదే" అని దిగలాపడ జొచ్చింది అవ్వ.

అప్పుడు శేషాచలం "నేనిస్తా తీసుకో అవ్వా' అంటూ జేబులోనించి పర్సుతీసి పావలా కాసుని నిర్లక్ష్యంగా ఆమెమీదికి గిరవాటు వేశాడు.

అవ్వ అదిపుచ్చుకుని "మంచివాళ్ళు యెక్కడయినా వుంటారు. ఈ అబ్బాయి మీకు చుట్టమా సరళమ్మా! మళ్ళానువ్వు కనిపిస్తావో లేదో? గాని బాబూ పావలా మా సరళమ్మకు యిస్తాలే పాపం దేవుడు వచ్చినట్లు వచ్చావు' అంది అవ్వ.

"ఈ పావలా భాగ్యానికి మళ్ళా యివ్వాలా అవ్వా" అంటూ అతడు నవ్వాడు.

"అయ్యో అదేమన్న మాట బాబు. ఎవరిదైనా సొమ్మే. సమయానికి అడ్డువడ్డావు. లేకపోతే యివ్వాళ ఏంకాను? పావలాకాని అఖరుకు కానీ గాని! సమయానికి చేతులో లేకపోతే యెన్ని చిక్కులు పడాలి"? అంది అవ్వ.

యింతలో యెవరో సూటు వేసుకున్న మరో యువకుడు వచ్చి "యిక్కడున్నావేమిటోయి శేషాచలం! నీకోసం అదంతా వెదుకుతున్నాను". అంటూ శేషాచలాన్ని పిలుచుకు వెళ్ళాడు.

4

ఒకనాటి సాయంకాలం శేషాచలం దుగ్గిరాల తూర్పువీధిలో నడుస్తున్నాడు. ఆ బజారు ఏమంత విశాలమైందికాదు. పూరియిళ్ళు కలగలుపుగా వున్నవి. షూటూ, బూటూ, చేతిలో లెదరుబ్యాగుతో వెళ్ళుతున్న శేషాచలాన్ని చూసి గుమ్మాల్లో నిలబడిన స్త్రీలు ఎవరో వుద్యోగస్తుడనుకుని లోనికి తప్పుకున్నారు. ఓగుమ్మం ముందు నిలుచున్న ఓముసలాయన్ను చూసి "యేం తాతా ఈవీధిలో భోజన హోటలు యెక్కడ" అని అడిగాడు శేషాచలం.

"అదిగో ఆకనపడుతున్నదే వేపచెట్టు ఆ ప్రక్క యిల్లే బాబూ"! అని చెప్పాడు ముసలాయన.

"ఆయన పేరేంటి తాతా?" అని అడగ్గా "దశరధరామయ్య" అని చెప్పాడు ముసలాయన.

శేషాచలం సరాసరి వేపచెట్టు ప్రక్కనవున్న యింటికి వెళ్ళాడు. అదిఒక పెంకుటిల్లు. భోజన హోటలని బోర్డు ఏమీలేదు. యింటి పంచలో రెండు కుర్చీలు వేసివున్నవి. ఓకుర్చీ మీద ఓముసలాయన కూర్చునివున్నాడు. ఎర్రటి శరీరచ్ఛాయ, నెరిసినజుట్టు, కుర్చీ అవతలగా చాపమీద ఎవరో వ్యక్తి కూర్చుని వున్నాడు. శేషాచలం వెళ్ళి ఖాళీగావున్న రెండో కుర్చీమీద కూర్చున్నాడు.

అవతల కుర్చీమీద కూర్చున్న ముసలాయన శేషాచలాన్ని చూసి "భోజనానికి వుంటారా బాబూ?" అని అడగ్గానే శేషాచలం "వుంటా నన్నాడు".

ఆముసలాయన పేరే దశరధరామయ్య ఆయన వెనక బాగా బ్రతికినవాడు. వ్యాపారాలూ, అవీ చేసినష్టపడి ఆఖరుకు ఈచిన్న భోజనహోటలు పెట్టి జీవనం చేస్తున్నాడు. వాళ్ళు కాపరం వుంటున్న యిల్లుగూడా అదే అక్కడ భోజనానికి ఏకొద్దిమందో తప్ప అట్టే జనం రారు.

గుమ్మం దగ్గరగా కూర్చున్న శేషాచలం కళ్ళు యింటిలోపలా బైటా వెదకనారంభించినవి. సరళ కనపడదేం? విజయవాడనించి యింకా రాలేదా? యిప్పటికి రైలు వచ్చివుంటుందే! యింటికివచ్చి యిరుగుపొరుగు యిళ్ళకు ఎక్కడకైనా వెళ్ళి వుంటుందేమో? అనుకున్నాడు.

పదినిముషాలు గడిచింది. అతనికళ్ళు వీధి గుమ్మంవేపే వున్నవి. సరళ యింకా రాలేదు సరళ భోజనహోటలని చెప్పిందే. అబద్ధం ఎందుకు చెపుతుంది? యిది మరిఒక హోటలు కాదుగదా. ఈప్రాంతంలో యింకా హోటళ్ళు వున్నయ్యేమో? యిదే అతని ఆలోచన.

చీకటి పడ్డది. దశరధరామయ్యగారు లాంతరు వెలిగించి వసారాకు వేళ్ళాడుతున్న కడ్డీకి తగిలించి భార్యపిలవగా లోనికి వెళ్ళాడు. యింతలో వీధి గుమ్మంలోనించి చేతులో ఖాళీ టిఫిన్ క్యారియర్‌తో చక చకా నడుస్తూ సరళ వచ్చింది. వసారాలో వెలుగుతున్న హరికెన్ లాంతరే అయినా సరళను చూసేసరికి శేషాచలం కళ్ళల్లో విద్యుద్దీపాలు వెలిగినవి. వసారాలో భోజనానికి వచ్చిన అతిధులు కూర్చుని వుండడం మామూలేకాబట్టే వాళ్ళను చూసీ చూడకుండా సరళ చరచరా యింట్లోకి వెళ్ళి పోయింది.

"బండి లేటయ్యిందా అమ్మా?" అని దశరధరామయ్యగారి గొంతు.

"యింకా రాలేదేమా అని నిన్నే అనుకుంటున్నాను అమ్మాయి". అని తల్లి గొంతు లోపలనించి బైటికి వినిపించింది.

రాత్రి యెనిమిదయింది. వచ్చిన అతిధులంతా శేషాచలంతో కలుపుకుని అయిదారుగురు లోపల భోజనానికి కూర్చున్నారు. దశరధరామయ్య భార్యాభర్తలు వాళ్ళకు వడ్డన చేశారు. భోజనాలు కాగా అంతా లేచారు. దశరధరామయ్యగారు డబ్బు వసూలు చేసుకోడానికి వసారాలో కుర్చీలో కూర్చున్నాడు. శేషాచలం చెయ్యితుడుచుకుంటూ వసారాలోకి వచ్చి ఆహా! ఏమి భోజనమండి! దశరధరామయ్యగారు పదహారణాల ఆంధ్రా భోజనం పెట్టారు. కమ్మటి కూరలు, గడ్డ పెరుగు, ఘుమఘుమలాడే నెయ్యి యిటువంటి భోజనం నేను ఏ హోటల్లోగూడా భోంచెయ్యలేదు. అంతా యింట్లో చేసుకున్నట్టుగా శుచిగా వుంది. ఎందుకండి అరవహోటళ్ళు తగలెయ్యనా? ఏది తినబోయినా వుప్పనా చప్పనా వుండవు. మూడు రోజులనాటి సాంబారు వడ్డిస్తే అదే మనవాళ్ళు అమృతమని త్రాగేస్తారు. మీలాంటి వారి హోటళ్ళు బస్తీకి రెండుమూడు వున్నా అరవవాళ్ళు మూడోనాటికి జండా పీక్కువెళ్ళరు" అన్నాడు.

దశరధరామయ్యగారు మందహాసం చేస్తూ ఏదోలెండి! యింకా ఈ పూట కూరలు సరిగా లెవ్వు" అన్నాడు.

యిక్కడికే చాలా బాగుంది. మేమంత తృప్తి పడ్డాం" అంటూ శేషాచలం పర్సులోనుంచి అయిదు రూపాయల కాగితంతీసి దశరధరామయ్య గారి కిచ్చాడు. దశరధరామయ్యగారు తిరిగి ఆయనకు రావలసినడబ్బు యివ్వబోగా అబ్బేవుంచండి. నేనిక్కడ రెండుమూడు రోజులు వుంటాను. రిజిస్ట్రారు ఆఫీసులో పనివుండి వచ్చాను. మీకు మళ్ళామళ్ళా యివ్వటందేనికి వెళ్ళేటప్పుడు లెక్క చూసుకుందాం" అన్నాడు.

అంతటితో యివ్వడానికి తీసినడబ్బు దశరధ రామయ్యగారు సంచిలో వేసుకున్నారు. భోజనం చేసిన తతిమ్మావాళ్ళకూడా డబ్బులు యివ్వగా లోపల భద్రపరచి దశరధరామయ్యగారుమళ్ళీవచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

అప్పుడు రాత్రి తొమ్మిది కావచ్చింది. శేషాచలం దశరధరామయ్యగారితో "యిక్కడే పడుకుంటానండి చాప దిండు ఒకటి యిస్తే చాలు. వూళ్ళో స్నేహితులూ వాళ్ళూ వున్నారు కానీండి బాగుండదు. రైలుమేష్టరు వున్నాడే వాడు నా ఫ్రెండే, కనిపిస్తే వదిలి పెట్టడు. నేను వెళ్ళదలుచుకోలేదు. బజారుకువెళ్ళి మళ్ళా యిప్పుడే వస్తాను" అంటూ వెళ్ళిపొయ్యాడు.

శేషాచలం తిరిగి వచ్చేసరికి పదికావచ్చింది. దశరధరామయ్యగారు భోజనంచేసి చుట్ట కాలుస్తూ వసారాలో కుర్చీలో కూర్చున్నాడు. అవతల ప్రక్కగా మంచంవాల్చి దిండు పక్కావేసి వున్నవి. మంచం అవతల చాపమీద ఎవరోవ్యక్తి గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. శేషాచలం వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. "మీరు యింకా రాలేదేమా అని చూస్తున్నా బాబూ. అట్లా మంచం


చదవాలి - సుఖపడాలి !




దాంపత్య జీవితంలో బలహీనులయి, నాశనమయ్యేవారి నుద్ధరించుటకు ప్రముఖ డాక్టర్లు కనుగొన్న కొన్ని అమూల్య రహస్యాలు, "జీవిత రహస్యాలు" పుస్తకంలో ఉన్నాయి. ఇంకా అందులో ఒకవంతు ధాతువుకు 80 వంతుల రక్తం నష్టమవుతుందనేది అబద్ధమని ఎలా నిరూపించారు, బీజాల వదులువల్ల ఫలితాలు, వాటిలో నొప్పులవల్ల బుడ్డ వగిబీజాలు, సుఖ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేసుకోడానికి కనుగొన్న మార్గాలు, కుటుంబ నియంత్రణమార్గాలు, ఇంకా మీ జీవితంలో వెంటనే తెలుసుకోవలసిన అన్ని సంగతులు, "జీవిత రహస్యాలు" అనే ఈ తెలుగు పుస్తకంలో ఉన్నాయి. వెల రు. 3—50. పోస్టు ఖర్చు ఉచితం. ఇవి క్రిందిచోటే దొరకును: దేశసేవ ప్రచురణలు, అశోకనగరు, ఏలూరు, ఆంధ్రకు వ్రాస్తే వి. పి. పోస్టు ద్వారా మీకూ పంపబడును.

మీద పడుకోండి'' అన్నాడు దశరథరామయ్య ఆయన వేషభాషలు చూసి మంచం వేయించాడు ముసలాయన.

ఆమాటకు ''థాంక్సు అయితే దశరథరామయ్యగారూ నాదగ్గర కొంత పైకం వున్నది. జేబులో పెట్టుకుని బైట పడుకోవడం అంత మంచిది కాదు కాస్త పెట్టెలోపెట్టి భద్రపరచండి'' అంటూ జేబులోనించి పర్సుతీసి అందులోనించి నాలుగు వందరూపాయల నోట్లు కొన్ని పదిరూపాయల నోట్లు తీసి దశరథరామయ్యగారి కందిచ్చాడు.

దశరథరామయ్యగారు వాటిని లెక్కబెట్టి ''నాలుగువందల ఎనభై రూపాయలు బాబూ గుర్తుంచుకోండి'' అంటూ లోపల పెట్టెలో భద్రపరిచాడు.

మర్నాడు పుదయానే శేషాచలం కాలకృత్యాలు తీర్చుకుని తనపనిమీద వెళ్ళిపోయి భోజనంవేళకు వచ్చాడు. భోజనంచేసి యింటివెనక వసారాలో మంచంమీద పడుకున్నాడు. వసారాముందు తాటాకు పందిరి. పందిరికి సన్నజాజుల చెట్టు అల్లుకున్నదీ ఎదురుగా గోడదగ్గర గేదె పడుకుని నెమరు వేస్తున్నది. పందిరిగుంజకు లేగ దూడ కట్టివేయబడి వున్నది.

ఆవాళ ఆదివారం అవటంవల్ల సరళ విజయవాడ పోలేదు. తల్లికి గృహకృత్యాల్లో సహాయపడుతున్నది. ఏదో పనిమీద వెనక వసారాలోకి వచ్చిన సరళను చూసి శేషాచలం మందహాసంతో ''సరళా యివాళ విజయవాడ పోలేదేం?'' అని అడిగాడు.

సరళ తలవంచుకునే ''యివాళ ఆదివారం'' అంది.

''అట్లాగా వంటాఅదీ నీకు చేతనవుతుందా?'' అని అడిగాడు.


''ఆఁ'' అంటూ సరళ పందిట్లో లేగదూడ దగ్గరికి వెళ్ళింది.

''పలుకే బంగారమా కాస్త నిలబడి మాట్లాడితే నీనోటి ముత్యాలేం రాలిపోతై'' అన్నాడు.

లేగదూడకు ఎండ రావడంవల్ల సరళ లేగదూడను విప్పి యివతల గుంజకు కట్టివేసి వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం సరళ పెరట్లో సన్నజాజి చెట్టుకింద యెత్తుపీట వేసుకుని పూలుకోస్తున్నది. సరళ వితంతువు. ఆమెపూలు పెట్టుకోకపోయినా కోసి యవరికైనా యిస్తుంది. ఆ చెట్టును చిన్నప్పుడు తానువేసి పెంచింది. అప్పట్లో కాసిన పూలన్నీ యెవరికీ పెట్టకుండా తానొక్కతే పెట్టుకునేది. వైధవ్యం వచ్చిన కొత్తలో ఆ చెట్టును చూసుకుని బావురమని ఏడ్చేది. సరళ తల్లికి మళ్ళీ పెళ్ళి చెయ్యాలని వుందిగాని దశరథరామయ్యగారు పూర్వాచార పరాయణుడు. అందుకాయన సమ్మతించలేదు. పిల్లకు మళ్ళీ పెళ్ళిచేసి వంశానికి కళంకం తీసుకురానన్నాడు. భార్య ఎంత మొత్తుకున్నా వినలేదు.

(సశేషం)



పంట కాలవ....

ఫోటో: ఏ. పి. యి. యిస్. శాస్త్రి.